

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - గొలుగొండ: పశువులకు ఎటువంటి వ్యాధులు సంక్రమించినా వెంటనే వెటర్నరీ పశు వైద్యాలయ అధికారులను సంప్రదించాలని కృష్ణదేవిపేట పశు వైద్యాధికారి శిరీష అన్నారు. సోమవారం కృష్ణదేవి పేట గ్రామంలో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 25 గైనిక్ కేసులు, 650 జీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగిందని వైద్యాధికారి శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో చోద్యం పశు వైద్యాధికారి డాక్టర్ రామ్మోహన్, కృష్ణ దేవి పేట పశు వైద్య కేంద్రం పశు వైద్య సహాయకులు, పశు వైద్య శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా వరి నాట్లు

విశాలాంధ్ర - కే.కోటపాడు: రైవాడ జలాశయ కాలువ పరిధిలోని గ్రామాల్లో జోరుగా వరినాట్లు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు అరకొరగా మాత్రమే ఉండడంతో రైవాడ జలాశయ పరిధిలో లేని గ్రామాల్లో నేటికీ వరినాట్లు ప్రారంభం కాలేదు. ఎక్కడో నీటి సదుపాయం విద్యుత్ మోటార్లు ఉన్నచోట మాత్రమే వరి నాట్లు జరుగుతున్నాయి. మండలంలోని మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, గొండు పాలెం, ఏ.భీమవరం, వారాడ, వీ.సంతపాలెం, ఏ.కోడూరు తదితర రైవాడ జలాశయ కాలువ పరిధిలోని గ్రామాల్లో మాత్రం వరి నాట్లు ఊపందుకున్నాయి. మహిళా కూలికి ఆటో చార్జీలతో కలిపి రూ. 450లు కాగా మగ కూలీకి రూ.600లతో పాటు క్వార్టర్ మద్యం కూడా అందిస్తున్నారు. టిల్లర్‌తో దమ్ము చేసే వారికి గంటకు రూ.400 కాగా ట్రాక్టర్‌తో దమ్ము చేసే వారు గంటకు రూ.1000లు కూలి తీసుకుంటున్నారు. దమ్ము, కూలీల ఖర్చులు పెరిగిపోవడంతో వ్యవసాయం చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పనులను అనుసంధానం చేస్తే మరలా రైతన్నలకు కొంత ఆర్థికంగా ఖర్చులు తగ్గడంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో ప్రతిసారి రాజకీయ నాయకులు వ్యవసాయానికి ఉపాధి హామీ పనులను అనుసంధానం చేస్తామని ప్రకటనలే తప్ప ఆచరణలోకి రావడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఆలోచించి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ప్రాణాలు కాపాడండి

ఎమ్మెల్యే కొణతాలకు బాధితుల వినతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అధిక మొత్తాల ఆశ చూపి ప్రజల నుండి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులమ్మి బాధితులకు డిపాజిట్లకు తిరిగి చెల్లించి వారి ప్రాణాలు కాపాడాలని అనకాపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణను బాధితులు వేడుకొన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలసి బాధితులు తమ గోడు వెలిబుచ్చారు. 10 సంవత్సరాలు కావస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల అనేకమంది బాధితులు బలవంతపు మరణాలు, ఆత్మహత్యలు చేసుకుని చనిపోయారని వృద్ధులు, అవసరాల కోసం పిల్లల పెళ్లిళ్ల కోసం, చదువుల కోసం దాచుకున్న సొమ్ము పది సంవత్సరాలు అయినా రాకపోవడంతో నిరాశ చెందిన బాధితులు మరిన్ని ఆత్మహత్యలు చేసుకునే బాట పట్టకముందే కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా డిపాజిట్లు తిరిగి చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొణతాల రామకృష్ణ స్పందిస్తూ ఇది న్యాయమైన సమస్య అని దీని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వైఎస్ భద్రం, అధ్యక్షులు కర్ణం మాణిక్యాలరావు, కార్యదర్శి ముల్లేటి గోపాల రమణ, పి.శేషు, రామ అప్పారావు, జె.దుర్గారావు, కొడతారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యం

నియోజకవర్గ సమన్వయకర్త భరత్

విశాలాంధ్ర - అనకాపల్లి: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి బొత్స సత్యనారాయణ గెలుపే ధ్యేయంగా అందరూ ఐక్యంగా పనిచేస్తామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. రింగ్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజవర్గ స్థాయి సమావేశంలో భరత్ మాట్లాడారు. వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి సీనియర్ నాయకులు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణని ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో అభినందనీయమన్నారు. నియోజవర్గ ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు వైసీపీకి చెందిన ఓటర్లలో 550కు పైగా ఉన్నారని గెలుపు మనదేనని తెలిసి కూడా కూటమి నాయకులు కొనుగోలే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం వల్ల మనకి పదవి అధికారాలు వచ్చాయో అందుకు విలువనిచ్చే సమయం ఇదేనన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల గళం విప్పి అందరి తరపు మాట్లాడే సమర్థుడైన నాయకుడు బొత్స సత్యనారాయణ అన్నారు. 80వ వార్డు కార్పొరేటర్‌కు గతంలో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం రావలసి ఉందని అయితే ఇప్పుడు సమిష్టిగా పనిచేస్తే తప్పకుండా మనకే వస్తుందని అన్నారు. అలాగే స్కూల్ కమిటీ సభ్యుల ఎంపిక విషయంలో వైసీపీకి అనుకూలంగా గెలుపు లభిస్తుందని ప్రధానంగా నాడు - నేడులో పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలు, ఉన్నత విద్యకు ప్రోత్సాహకాలు మనమే ఎక్కువగా చేశామని ఆ విషయం అందరికీ తెలుసని తప్పనిసరిగా ఈ ఎన్నికలలో విజయం లభిస్తుందన్నారు. కాగా ముందుగా మాజీ ఎంపీ బీసెట్టి వెంకట సత్యవతి, జిల్లా అధ్యక్షులు బొడ్డేడు ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరు దిలీప్ కుమార్, 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్, మళ్ళ బుల్లిబాబు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కలగా గున్నయ్య నాయుడు, అనకాపల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, 80వ వార్డు ఇన్‌చార్జ్ కొణతాల భాస్కర్, పెంటకోట శ్రీను, జిల్లా కో ఆప్షన్ పెతకంశెట్టి జోసెఫ్, రత్నకుమారి, నమ్మి గణేష్, వైస్ ఎంపీపీ ఐతా రాము, విల్లూరి చంద్రశేఖర్, సూర్యనారాయణమూర్తి దేవస్థానం మాజీ చైర్మన్ కేఎం నాయుడు, పిల్లా రాజు, బీశెట్టి యశ్వంత్, బీశెట్టి జగన్, కరకా సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇటీవలే కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం వేధింపులకు గురైన వైసీపీ నాయకుడు గొల్లవిల్లి బాబురావు మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. వారి కుటుంబాన్ని అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పరామర్శించి ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారి కుటుంబానికి 50,000/- ఆర్థిక సహాయాన్ని అందజేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: జిల్లాలోని జలాశయాలు, రైతుల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ రైతు విభాగం అధ్యక్ష కార్యదర్శులు గొల్లివిల్లి శ్రీరామ్మూర్తి, ఉగ్గిన రమణమూర్తిలు సోమవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని రైవాడ, కోనాం, పెద్దేరు తారకరామ, గొర్రిగెడ్డ, ఉరకగెడ్డ, జలాశయాలు ఉన్నాయన్నారు. వీటిలో కొన్ని మాత్రమే పూర్తి కాగా మిగిలినవి అసంపూర్తిగా నిలిచిపోయాయని చెప్పారు. ప్రధానంగా జిల్లాలో వరి చెరకు ప్రధాన పంటలు కాగా అపరాలు, పప్పుదినుసులు, కూరగాయల సాగు జరుగుతున్నాయని వివరించారు. వాణిజ్య పంటలుగా పామాయిల్, నువ్వుల పంటలు సాగు చేస్తున్నారన్నారు. జిల్లా అంతట వాణిజ్య పంటలైన బెల్లం రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో దిగుబడి తగ్గిపోయిందని చెప్పారు. గోవాడ, తుంపాల, ఏటికొప్పాక, తాండవ కర్మాగారాల్లో ప్రస్తుతం ఒకటే నడుస్తుందన్నారు. గోవాడ ఫ్యాక్టరీలో గతంలో 20వేల రైతులతో నాలుగు లక్షల టన్నుల క్రషింగ్ జరిగేదని, ప్రస్తుతం కేవలం రెండు లక్షల టన్నులకు తగ్గిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఉపాధి పనులను చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. దీని మూలంగా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. కావున ఉపాధి హామీ పథకం వలన కూలీలు దొరక్క చెరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పథకాన్ని రైతు పండించే పంటలకు అనుసంధానం చేస్తే రైతుల పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. అలాగే జిల్లాలో నీటిపారుదల శాఖ వ్యవస్థ మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.కోడూరు కోఆపరేటివ్ అధ్యక్షులు, బీజేపీ మండల నాయకులు గొల్లవిల్లి రాజేష్, జనసేన పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు గ్రెడ్డి శివాజీ, దాసరి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 30 మంది రైతుల

భూమి వివరాలు తొలగింపు

ఎందుకు తొలగించారో చెప్పాలని రైతుల డిమాండ్

కలెక్టరేట్ వద్ద నారాయుడుపాలెం రైతుల నిరసన

విశాలాంధ్ర - మునగపాక: ఆన్‌లైన్‌లో నమోదు అయిన తమ భూముల వివరాలను రాజకీయ దురుద్దేశంతో తొలగించారని తక్షణమే యథావిధిగా తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మునగపాక మండలం తాటిపల్లి పంచాయతీ నారాయుడి పాలెం గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు లక్ష్మి, రాము, జి.అప్పారావు, సిహెచ్.దుర్గమ్మ, కె.వీరు నాయుడు, కే.నూకరాజు, ఒడిసెల శ్రీదేవి, ఒడిసెల వరలక్ష్మి, కే. సింహాచలం నాయుడు, ఎర్ర. నాగమణి, ఐ.నూక అప్పారావు, బొట్ట అప్పలరాజు, కే.వెంకటలక్ష్మి, కాకర అప్పారావులు మాట్లాడుతూ పాటిపల్లి పంచాయతీ నారాయుడుపాలెం గ్రామంలో తాము గత 28 సంవత్సరాల నుండి కొండ బంజరి భూములను సాగు చేసుకొని జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. 2009-2010లో అప్పటి ప్రభుత్వం స్పందించి రైతులు భూములను సాగు చేసే తీరునబట్టి డి- ఫారం పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. అప్పటి నుండి ప్రభుత్వం తరుపున రైతు భరోసా, పి.ఎమ్. కిసాన్ సహాయం కూడా పొందుతున్నామన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చేశారని తెలిపారు. అయితే గత ప్రభుత్వం రీ-సర్వే చేసిన తరువాత సుమారు 30 మంది రైతుల భూములకు సంబంధించిన వివరాలు రాజకీయ దురుద్దేశంతో ఆన్‌లైన్ నుండి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించడానికి కారణం ఏమిటో తెలియక ఆందోళన చెందుతున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని తమ భూములు తమకు యదావిధిగా ప్రభుత్వ రికార్డులో చూపించే విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - చీడికాడ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా నాయకులు రొంగలి దేవుడునాయుడు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీ నిలుపుదల చేయాలని అర్హులైన వారికి అటెండర్ వాచ్‌మెన్ రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని వారి పోస్టులలో ప్రమోషన్లు కల్పించాలని వేతనాలు పెంచాలని కోరారు. వారు రెవెన్యూ వ్యవస్థలో అనేక రూపాలలో ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. వారికి సుప్రీంకోర్టు చెప్పిన విధంగా వేతనాలు అమలు చేయలేదని తక్షణమే కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు నాగేశ్, జి.తాతబాబు, రమణ, ప్రసాద్ నాయుడు, రమణమ్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో మారేపల్లి తెనుగుపూడి రహదారిలోని చెరుకు తోటలో అల్లు అప్పారావు (40) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అటు వైపు పొలం పనులకు వెళుతున్న స్థానికులకు మృతదేహం కనిపించడంతో మృతుని బంధువులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న మృతుని భార్య దుర్గా లక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త అల్లు అప్పారావు క్రషర్ మెకానిక్ పనికి శనివారం వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదు చేసింది. వెంటనే దేవరాపల్లి ఎస్సై డి.నాగేంద్ర ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

డైట్‌లో అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

విశాలాంధ్ర - అనకాపల్లి: స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ అటానమస్ కళాశాలలో సోమవారం అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే కళాశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దుర్గా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ తమ కాలేజ్‌లో జాయిన్ అయ్యే పిల్లలకు అన్ని సౌకర్యాలను చేకూరుస్తామని అన్నారు. ఉన్నత చదువును బోధించే అధ్యాపకులతో చదువు చెప్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వెయ్యడమే కళాశాల ప్రధాన ఉద్దేశం అని అన్నారు. సీఎస్ఎండీ విభాగాధిపతి ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 100 కొత్త కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మేనేజ్‌మెంట్ 50,00,000 లక్షలు వెచ్చించి ఈ కొత్త టెక్నాలజీకి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయడం జరిగిందని తెలిపారు.

రాజాం విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షునిగా నడిపల్లి రమణ ఏకగ్రీవం

విశాలాంధ్ర - బుచ్చియ్యపేట: మండలంలో రాజాం గ్రామంలో విశాఖ డెయిరీ పాల కేంద్రం అధ్యక్షునిగా నడిపిల్లి రమణ ఎన్నికైనట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. సోమవారం అధ్యక్షుడు రమణను, డైరెక్టర్లుగా ఎన్నికైన మరిషా సత్యారావు, మంత్రి వరహాలమ్మ తదితరులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలు డైరెక్టర్లు మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్, మండల తెలుగు రైతు అధ్యక్షులు మరిచా నరేష్, రాజాం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా పడ్డ మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. సోమవారం మండల పరిషత్ అధ్యక్షురాలు కోన లోవ లక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఎన్నికల కోడ్ ఉండడంతో అధికారులు కూడా హాజరవలేదు. మరల తదుపరి తేదీని ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.

గుంటూరు లక్ష్మణరావుకి "కవి కేసరి" జాతీయ పురస్కారం

విశాలాంధ్ర - రావికమతం: రావికమతం మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన గుంటూరు లక్ష్మణరావు' కవి కేసరి జాతీయ పురస్కారం లభించింది. పలు ప్రక్రియల్లో రచనలు, కథలు రాస్తూ, సామాజిక చైతన్యం కలిగిస్తూ, కథా విశారద, తెలుగుశ్రీ, వెలుగు దివ్వెకవిమిత్ర, దివ్యజ్యోతి, జ్యోతిర్మయి, కవిశ్రేష్ఠ, కవిశేఖర, కవి శారద, కవి భాస్కర, కవీశ్వర, చిమ్మీ విభూషణ, మధురకవి విభూషణ, ఆంధ్రకేసరి-సేవారత్న, పుడమిరత్న వంటి పలు పురస్కారాలు గతంలో పొందారు. భద్రాద్రి సాహితీ వేదిక, భద్రాద్రి, కొత్తగూడెం, తెలంగాణ వారు రోజుకొకటి చొప్పున హరివిల్లు కవితలు మాత్రా ఛందస్సుతో కూడినవి "1500" కవితలు వ్రాసిన వారికి ఇచ్చే "హరివిల్లు కవి కేసరి" జాతీయ పురస్కారం అందించారు. భద్రాద్రి సాహితీ వేదిక కొత్తగూడెం వ్యవస్థాపక అధ్యక్షులు వి.టి.ఆర్.మోహన్ రావు, హరివిల్లు రూపకర్త మామిడి రమేష్, అధ్యక్షులు సీర హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిట్టి మధు, నిర్వాహకులు ఆన్‌లైన్ వేదికగా ప్రసంశాపత్రం అందించి, అభినందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పలువురు సాహితీ మిత్రులు గుంటూరు లక్ష్మణరావును ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారు.

తల్లిపాలే బిడ్డకు పౌష్టికాహారం

విశాలాంధ్ర - కే.కోటపాడు: తల్లిపాలే పిల్లలకు శ్రేష్టమైన పౌష్టికాహారమని తల్లిపాలను బిడ్డకు ఇవ్వడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఎం.రాములమ్మ, ఎల్పి సుశీల అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మేడిచర్ల గ్రామంలో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు ప్రతి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని తోటాడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు సీడీపీఓ ఇంద్రా దేవి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. మండల వ్యాప్తంగా అంగనవాడి టీచర్లు, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో తల్లిపాల విశిష్టత గురించి వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంద్ర దేవి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం అన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదలతో పాటుగా సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందన్నారు. ఇతర ద్రవ పదార్థాలు ఇవ్వడం వలన అనారోగ్యానికి హేతువు అన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆహార విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి: మున్సిపాలిటీ పరిధి తులసినగర్‌లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, సంబంధిత సచివాలయ పరిధి ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, మహిళా పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు తాగించాలన్నారు. మొదటి 6 నెలల వయసు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తద్వారా పుట్టిన బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: మిషన్ వందరోజుల కార్యక్రమాలలో భాగంగా సోమవారం బుచ్చిరాజుపేట గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలతోనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారంటూ శనివారం మండలంలో బుచ్చిరాజుపేట గ్రామంలో వివిధ కార్యక్రమాలను అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది సంయుక్తంగా కలిసి ర్యాలీ చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్త పి.రమణమ్మ ఆధ్వర్యంలో బోధన విరామం సమయంలో హాజరైన మహిళ పోలీస్ నూర్జహాన్ మాట్లాడుతూ పోషక విలువలు తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వారికి వివరించారు. దీనిలో భాగంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, తల్లుల సమక్షంలో అంగన్వాడీ సిబ్బంది చేపట్టిన ఆకృతి పలువురుని ఆకట్టుకుంది. ఏఎన్ఎం సింహాచలం, ఎంఎల్‌హెచ్‌పి సాయి పద్మ, ఆశ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

తొలగించిన విద్యుత్ స్తంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ధర్మవరం గ్రామంలో స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం విశాలాంధ్ర పత్రికలో వెలువడడంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన కథనంపై ఏఈ స్పందించి తక్షణం ఆ స్తంభాలను తొలగించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ తన సిబ్బందితో ఆ స్తంభాలను పూర్తిస్థాయిలో తొలగించారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - యస్.రాయవరం: పెనుగొల్లు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఒకదానికి ఒకటి

ఢీకొట్టుకున్నాయి. అదే సమయంలో పెనుగొల్లు గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు(5) టీ తాగేందుకు వెళ్తున్న సమయంలో లారీ ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విభూషణరావు తెలిపారు.

లంకెలపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

బీజేపీ నేత కోటంశెట్టి మృతి

విశాలాంధ్ర - పరవాడ: జాతీయ రహదారిపై లంకెల పాలెం వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో అనకాపల్లి మండలం రూరల్ బీజేపీ అధ్యక్షుడు కోటంశెట్టి అప్పారావు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి మండలం మారేడుపూడి కాలనీలో నివాసం ఉంటున్న కోటంశెట్టి అప్పారావు అలియాస్ మేస్త్రి అప్పారావు (60) ఫ్రూట్స్ ఇతర సామగ్రి కోసం ద్విచక్ర వాహనంపై లంకెలపాలెం వెళ్లారు. పని చూసుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో హెచ్.పి పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి ఓ ఫార్మా కంపెనీకి చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో అతను రోడ్డుపై తూలి పడ్డాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పరవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండవాలు ప్రాంతాలలో
పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

జీవీఎంసీ కమిషనర్ వి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కొండవాలు ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని జీవీఎంసీ కమిషనర్ వి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-5 నందు 45, 47, 53 వార్డుల పరిధిలోని వైయస్సార్ నగర్ ఎఫ్.సి.ఐ గోడౌన్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌లను, కప్పరాడ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైయస్సార్, ఎఫ్.సి.ఐ గోడౌన్ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అన్ని అన్న క్యాంటీన్ల లో డ్రైనేజ్ సిస్టమ్ క్రమ పద్ధతిలో మురుగు నీరు సాఫీగా పోయే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. తదుపరి కప్పరాడ లోని కొండవాలు ప్రాంతాలలోని కాలువలు, రోడ్లతో పాటు పారిశుధ్యం పనులను పరిశీలించి మరింత పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కొండవాలు ప్రాంతాలలో కాలువల నందు వ్యర్థాలు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని, ఈ ప్రాంతంలో దుకాణాదారులు, వీధి వ్యాపారులు కాలువలలో వ్యర్థాలు వేయకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. పలుచోట్ల వీధిలైట్లు లేనందున ఆ ప్రాంతంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, పూర్తిగా పాడైన మరామ్మత్తుకు గురైన కాలువలకు మరమ్మతులు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాలరావు ను ఆదేశించారు. ఆ ప్రాంతంలో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ లేనందున, నివాసితులు ఎప్పటికప్పుడు మురుగు నీటిని తరలించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కొండవాలు ప్రాంతంలో నివాసాలు అధికంగా ఉన్నందున పారిశుద్ధ్య విధి నిర్వహణకు వయస్సు పైబడిన పారిశుధ్య కార్మికులకు వేరొక ప్రాంతాలకు మార్పిచేసి సమర్ధలైన పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి తద్వారా పారిశుద్ధ్య పనులను వేగవంతం అయ్యేలా చూడాలని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి క్రిష్ణ ను కమీషనరు ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ప్రసన్న, సహాయక వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఏసిపి వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి అర్చన, శానిటేషన్, ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పారా అథ్లెట్ విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జూలై 15 నుంచి 17 వరకు బెంగుళూరు కంఠీరావ స్టేడియం వేదికగా జరిగిన జాతీయ స్థాయి జూనియర్ %డ% సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్ 2024 లో గెలుపొందిన పారా అథ్లెటిక్స్ క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం అభినందించారు. బెంగళూరు వేదికగా జరిగిన ఈ ఛాంపియన్షిప్ లో విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు కె.తేజ శ్రీ లాంగ్ జంప్‌లో బంగారు పతకం, 100 మీటర్స్‌లో రజత పతకం, సాయి నిఖిల్ గౌతమ్ 1500 మీటర్స్‌లో లో కాంస్య పతకం, సూర్య రోహిత్ 100మీటర్స్‌లో కాంస్య పతకం, 400మీటర్స్‌లో కాంస్య పతకం, లక్ష్మణ 100మీటర్స్‌లో రజతం, 400మీటర్స్‌లోలో బంగారు పతకం, గౌతమ్ 400మీటర్స్‌లో రజతం, లాంగ్ జంప్‌లో బంగారు పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని విశాఖపట్నం జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ గిరీష, పారాస్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సెక్రటరీ వి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ హైస్కూల్‌ను
తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వి. అప్పారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు సకాలంలో పాఠ్యాంశాలను చెప్పాలని ఉపాధ్యాయులు సూచించారు. మధ్యాహ్నం భోజనం పథకం పరిశీలించి పలు సూచన చేశారు అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు.

స్కీం వర్కర్లపై
రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణలు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా స్కీం వర్కర్లపై వేధింపులు, తొలగింపులు పెరిగాయని అన్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం, వివోఏ, అంగన్వాడి, ఆశ, వీఆర్పి గ్రామపంచాయతీ కార్మికులను 800 మందిని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగాల్లోంచి తొలగించారన్నారు. కొద్దిమంది స్కీం వర్కర్లు ఆత్మహత్యా ప్రయత్నం చేశారని, అచ్యుతాపురం మండలంలో ఇద్దరు పంపు ఆపరేటర్లని తొలగించారన్నారు. మధ్యాహ్న భోజన పథకం ఆర్పీలపై రాజకీయ ఒత్తిడులు పెరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందిన వారు ఉద్యోగాల నుంచి తొలగిపోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెదిరింపులు తొలగింపులు ఉండవని చెబుతున్న సరే క్రింది స్థాయిలో నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే వేధింపులు ఆపాలని, తొలగించిన వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. గత ఐదు నెలలుగా ప్రభుత్వ స్కూల్ స్వీపర్లకు గ్రామపంచాయతీ కసింకోట, తుంపాల కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కివినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వివి.శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, శ్రీదేవి, జానకి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అప్పలరాజు, చిన్నారావు, అప్పారావు, ప్రసన్న పాల్గొన్నారు.

బద్ది దర్శిని కుటుంబానికి న్యాయం చేయాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: గత నెల 6న రాంబిల్లి మండలం కొప్పుగొండపాలెం గ్రామంలో బద్ది దర్శిని అనే మైనర్ బాలికను అత్యంత కిరాతకంగా నరికి చంపేసిన ఘటనపై పోక్సో యాక్టు ప్రకారం, నిర్భయ రిలీఫ్ ఫండ్ కేటాయించాలని, బాధిత కుటుంబానికి పునరావాసం కల్పించాలని కోరుతూ ఐద్వా మహిళా సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్, జిల్లా ఎస్పీకి బాధిత కుటుంబ సభ్యులతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, ఐద్వా మహిళా సంఘం, జిల్లా నాయకులు ఆర్ లక్ష్మి, కొప్పుగొండపాలెం గ్రామ మాజీ సర్పంచ్ బద్ది వెంకటరమణ వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవుడు నాయుడు మాట్లాడుతూ బద్ది దర్శినిని ప్రేమ పేరుతో వేధించి, ఇబ్బందులకు గురిచేసిన సురేష్‌పై ఫోక్సో యాక్ట్ కేసు నమోదు చేసి సెంట్రల్ జైలుకు పంపించారని జైలు నుండి బయటకు వచ్చాక, అమ్మాయి తను చెప్పినట్టు వినలేదని, మైనర్ అమ్మాయిని అత్యంత కిరాతకంగా, అత్యంత దారుణంగా కత్తితో నరికి చంపేసిన ఘటన తెలిసిందే. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న హోం మంత్రి స్పందించారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మీడియా పరంగా తెలియజేశారు. ఇప్పటికీ ఘటన జరిగి నెలరోజులు కావస్తున్నప్పటికీ ఆ కుటుంబాన్ని ఏ విధంగానో ఆదుకోలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా సకాలంలో స్పందించి, సంబంధిత పోలీస్, రెవెన్యూ అధికారులు కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలోని వీరనారాయణం గ్రామం సమీపంలో గల గెడ్డ నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు గ్రిడ్డి శివాజీ, దాసరి అచ్యుతరావులు వాపోయారు. సోమవారం మండల డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మయ్య దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే ఇంత అధ్వాన్నంగా ఇసుక అక్రమ రవాణా జరిగినా వీఆర్వో పట్టించుకోలేదని చెప్పారు. తక్షణమే ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా నాయకులు లెక్కల కాశిబాబు, మాడుగుల టౌన్ పార్టీ అధ్యక్షులు వద్దాది రంజిత్ వర్మ తదితరులు ఉన్నారు.

మత్స్యకార భరోసా విడుదల చేయాలి

విశాలాంధ్ర - యస్. రాయవరం : మత్స్యకారులకు ప్రతి సంవత్సరం ఇచ్చే భరోసాను తక్షణం చేయాలని ఎంపీటీసీలు ఎంపీడీవో సత్యనారాయణమూర్తి కి వినతిపత్రం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ మత్స్యకార సంఘం నాయకుడు చోడిపల్లి అప్పన్న ఆధ్వర్యంలో వినతిపత్రం జరిగింది. మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడే ఈ భరోసా ఇచ్చే విధంగా ప్రభుత్వానికి పత్రం పంపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.